క్లుప్తంగా

కొనసాగుతున్న రాజశ్యామల యాగం

నందిగామ: పట్టణ శివారు పల్లగిరి గుట్టపైగల త్రిశక్తి పీఠంలో చేపట్టిన రాజశ్యామల సహిత రుద్ర యాగాలు ఘనంగా కొనసాగుతున్నాయి. త్రిశక్తి పీఠం 9వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న రాజశ్యామల యాగాల్లో భాగంగా రెండోరోజైనా శుక్రవారం ఆలయంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞానసరస్వతి అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం వేద పండితులు రాజేష్‌శర్మ, సాయిశర్మ, శేఖర్‌శర్మ ఆధ్వర్యంలో రాజశ్యామల సహిత రుద్రయాగం నిర్వహించారు. ఆయా పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని సర్పంచి జక్కులూరి రాంబాబు అన్నారు. గ్రామంలోని యూపీ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంతో కూడిన స్టూడెంట్స్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కె సత్యనారాయణ, నలజాల రాజు, చల్లాల శివాజీ, కె.వెంకటనారాయణ, హెచ్ఎం బి.లింగయ్య, టీచర్లు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం గ్రామానికి చెందిన ఆలయ మాజీ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు దంపతులు రూ.10,116 విరాళంగా ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఏరువాక పౌర్ణమి



నందిగామ: ప్రభుత్వం రైతులకు అవసరమైన రాయితీలు అందించి, వారిని ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి చుండూరు సుబ్బారావు కోరారు. రైతుసంఘం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని రామిరెడ్డిపల్లిలో రైతులతో కలిసి వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా చుండూరు సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యంగా వాతావరణ ఒడిదుడుకులను తట్టుకొని నిలబడేలా ఉండేందుకు రైతులకు ప్రభుత్వం పలు రకాల రాయితీలను కల్పించాలని సూచించారు. గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

గ్రామోత్సవం

పెనుగంచిప్రోలు: ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం తరుపున శుక్రవారం పానకం కావిళ్ల గ్రామోత్సవం నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆలయం వద్ద నుంచి గ్రామంలో ఈ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు, అమ్మవారి క్రతువులు నిర్వహించే ఆయా కులాల వారు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తాతయ్యను కలిసిన ఎన్జీవో నాయకులు



జగ్గయ్యపేట అర్బన్: ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్‌తోపాటు ఎన్జీవో జిల్లా నాయకులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎన్జీవో సంఘ జిల్లా కార్యదర్శి ఇక్బాల్, సంఘ జిల్లా , విజయవాడ నాయకులు రమేష్‌ప్రసాద్, సతీష్, రామకృష్ణ, శ్రీనివాసరావు,గోపాలకృష్ణ, స్థానిక నాయకులు వెంకట్రావు, బాబురావు, బాలాజీ, కుప్పాల శ్రీను, విజయవర్ధన్, కృష్ణయ్య, రమేష్ ఉన్నారు.

పల్టీ కొట్టిన ట్యాంకర్ లారీ

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): ఫ్లయాష్ లారీ పల్టీ కొట్టిన ఘటన శుక్రవారం సాయంత్రం అనుమంచిపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కోదాడ నుంచి విజయవాడ వెళ్తున్న ట్యాంకర్ లారీ అనుమంచిపల్లి వద్ద అదుపు తప్పి జాతీయరహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి పల్టీ కొట్టింది. దీంతో లారీ ధ్వంసమైంది. విషయాన్ని గమనించిన స్థానికులు లారీలోని డ్రైవర్‌ను 108 ద్వారా జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

షేర్‌మహ్మద్‌పేటలో డయేరియా విజృంభణ

- 20మందికిపైగా ఆస్పత్రిపాలు
- గ్రామంలో అధ్వాన్నంగా పారిశుద్ధ్యం
- తాగునీటి బావివద్ద దుర్భర పరిస్థితి
- గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్
- వైద్యశిబిరం ఏర్పాటుకు ఆదేశం



డయేరియా సోకడంతో ఇంటివద్ద చికిత్స పొందుతున్న గ్రామస్తుడు సోములు



షేర్‌మహ్మద్‌పేటలో మంచినీటి బావిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో డయేరియా విజృంభిస్తోంది. రెండురోజులుగా గ్రామంలోని మోడల్ కాలనీ, పాతకాలనీ, ఆటోనగర్ ఏరియా ప్రాంతాలలో ఒక్కసారిగా వాంతులు, విరేచనాలతో ప్రజలు మంచం పట్టారు. ఇప్పటికే 20మందికి పైగా గ్రామస్తులు జగ్గయ్యపేటలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులతోపాటు కోదాడ, ఖమ్మం ప్రాంతాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. డయేరియా విజృంభిస్తున్నా అధికారులు కనీసచర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ఆస్పత్రుల్లో చేరిన బాధితులు..

గ్రామంలో గురువారం నుంచి ఒక్కసారిగా వాంతులు, విరేచనాలు అవుతుండటంతో పలువురు బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన గడ్డం సోములుకు ఒక్కసారిగా వాంతులు, విరేచనాలు కావడంతో ఇంటిలోనే ఆర్ఎంపీతో వైద్యం చేయించుకుంటున్నారు. కొందరు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో సుహాసిని శుక్రవారం షేర్‌మహ్మద్‌పేటలో పర్యటించారు. ఇంటింటి సర్వే చేయాలని, గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను కోరారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో మోతిబాబు, వైద్యాధికారి అనిల్‌కుమార్, సూపర్‌వైజర్ వెంకట్రావ్ ఉన్నారు. అదేవిధంగా మండలంలోని అనుమంచిపల్లి, గంద్రాయి, బూదవాడలలో సైతం డయేరియా కేసులు నమోదవుతున్నట్లు అధికారుల దృష్టికి తెచ్చారు.

అధ్వాన్నంగా పారిశుద్ధ్యం..

షేర్‌మహ్మద్‌పేటలో కొంత కాలంగా పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగకపోవడంతో ప్రత్యేకాధికారి పాలన సాగుతోంది. మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేకాధికారి పాలన పూర్తిగా పడకేసింది. కనీసం గ్రామంలో డ్రైన్‌లు పూడిక తీయకపోతుండటంతో పాటు తాగునీటి ట్యాంకుల వద్ద పారిశుద్ధ్య చర్యలు కూడా చేపట్టడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలోని చెరువు ఒడ్డునున్న తాగునీటి బావి నుంచి రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా గ్రామస్తులకు మంచినీటిని సరఫరా చేస్తుండగా, ఆ బావి చుట్టూ రక్షణ గోడ లేదు. బావి పరిసరాలన్నీ పిచ్చి మొక్కలతో నిండి మూగ జీవాలకు ఆవాసంగా మారింది. రక్షణ మెస్ లేకపోవడంతో రాత్రి వేళల్లో ఆకతాయిలు మద్యం సీసాలు తదితరాలను బావిలో పడేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. డ్రైన్‌లు కూడా పూడిక తీయకపోవటంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది.

గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే

షేర్‌మహ్మద్‌పేటలో డయేరియా విజృంభించిన నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొందరు డయేరియాతో బాధపడుతుండటంతో వారికి మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డయేరియా అదుపులోకి వచ్చే వరకు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా ఈ నెలాఖరుకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో సుహాసిని, నందిగామ ఆర్డీవో రవీంద్ర, పంచాయతీ రాజ్, వైద్యారోగ్య శాఖాధికారులు పాల్గొన్నారు.



మోడల్‌కాలనీ ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద పారిశుద్ధ్య పరిస్థితి

పారిశుద్ధ్యం సరిగా లేదు...



కొద్దిరోజులుగా గ్రామంలో చెత్త సేకరించేందుకు పంచాయతీ సిబ్బంది రావడం లేదు. డ్రైన్‌లు పూడిక తీయక నెలలు గడిచిపోయాయి. పంచాయతీ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. తాగునీరు కూడా కలుషితమవుతోంది. దీంతో గ్రామస్తులు వాంతులు, విరోచనాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– చల్లా లక్ష్మి, షేర్‌మహ్మద్‌పేట



షేర్‌మహ్మద్‌పేటలో మూగజీవాలకు ఆవాసంగా మారిన చెరువు ఒడ్డునున్న తాగునీటి బావి



గ్రామస్తులు తాగేది ఈ బావిలో నీరే

జగ్గయ్యపేటలోనూ డయేరియా కేసులు



పేట ప్రభుత్వాస్పత్రిలో వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్న బాధితురాలు

జగ్గయ్యపేట అర్బన్: వర్షాకాలం ప్రారంభంలోనే పట్టణంలో డయేరియా ప్రబలింది. అనేక వార్డుల్లో డయేరియా బాధితులు పెరిగిపోతున్నారు. ప్రస్తుతం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో వాంతులు, విరోచనాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారు 11 మంది ఉన్నారని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఆళ్ల హరీష్ శుక్రవారం తెలిపారు. వారికి ప్రత్యేక వైద్య చికిత్స అందజేస్తున్నట్లు వివరించారు. ఈనేపథ్యంలో పురపాలక శాఖ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డయేరియా నివారణతోపాటు పారిశుద్ధ్య మెరుగుదల చర్యలు చేపట్టారు.పేటలో పలువురు అస్వస్థతకు గురవడంతో స్పందించిన మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పట్టణంలో ఉన్న వాటర్ ట్యాంకులను, పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే హెడ్‌వాటర్ వర్క్స్‌ను పరిశీలించారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డయేరియా కేసులపై మున్సిపల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు, డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. డయేరియాతో పాటు సీజనల్ వ్యాధులతో బాధపడే కేసులను గుర్తించే కార్యక్రమం చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు చెప్పారు. ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయడం, బ్లీచింగ్ చేయడం, వార్డుల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణను చేపట్టినట్లు వివరించారు.

పేషంట్లను పరామర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్



పేట ప్రభుత్వాస్పత్రిలో పేషంట్లను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, కలెక్టర్ ఢిల్లీరావు, సుహాసిని

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), కలెక్టర్ ఢిల్లీరావు సందర్శించారు. డయేరియాతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్సపొందుతున్న షేర్‌మహ్మద్‌పేట, బూదవాడ, అనుమంచిపల్లి, వత్సవాయి మండలం మక్కపేట, మంగొల్లు, చిట్యాల, దేచుపాలెం తదితర గ్రామాల పేషంట్లను పరామర్శించారు. తాగునీరు, వాతావరణం మార్పు కారణంగా ఈసమస్య తలెత్తిందని కలెక్టర్, ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, బయటి ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో తినరాదని ప్రజలకు సూచించారు. ప్రతి పేషంటుకు మెరుగైన వైద్యసేవలను అందిస్తామని ఎమ్మెల్యే తాతయ్య తెలిపారు.

అదుపులో డయేరియా: డీఎంహెచ్ఓ

జగ్గయ్యపేట పట్టణంతోపాటు షేర్‌మహ్మద్‌పేట, గంద్రాయి తదితర గ్రామాల్లో డయేరియా అదుపులోనే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. జగ్గయ్యపేటలోని ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి డయేరియాతో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు గురువారం అర్ధరాత్రి డీఎంహెచ్‌వో సుహాసిని, వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ బృందంతో ఆయాప్రాంతాలు హుటాహుటిన సందర్శించి డయేరియా నివారణ చర్యలు చేపట్టారు. డీఎంఅండ్‌హెచ్ఓ సుహాసిని మాట్లాడుతూ అనుమంచిపల్లి, బూదవాడ, జగ్గయ్యపేటటౌన్, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల నుంచి పలువురు విరేచనాలతో బాధపడుతున్నారని, వారు వెంకటసన్నీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులు వివిధ ప్రాంతాలకు చెందిన వారీగా గుర్తించినట్లు ఆమె వివరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): క్రమం తప్పకుండా యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని వైద్యాధికారి వై.రత్నప్రియదర్శిని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గ్రామంలోని చైతన్య హైస్కూల్, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు యోగాసానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా సాధనతో మనిషిలో రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. యోగా అభ్యసనం ద్వారా అనేక రోగాలు రాకుండా నిరోధించవచ్చన్నారు. అనంతరం యోగా శిక్షకులను సత్కరించారు. హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు, గింజుపల్లి నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గురు విశ్వస్ఫూర్తి వారి ఆశీస్సులతో స్థానిక స్ఫూర్తి కుటుంబసభ్యులు యోగా, ధ్యాన సాధన విధానంపై అవగాహన కల్పించారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : యోగాసనాలు శరీర ధారుఢ్యానికి ఎంతగానో దోహదపడి చక్కటి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయని ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ అన్నారు. మండలంలోని గండేపల్లి, పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు యోగా నేర్పించారు. ఈ మేరకు హెచ్ఎం మాట్లాడుతూ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు రోజూ యోగా చేయడం ద్వారా గొప్ప ఉపశమనం పొందవచ్చన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ కాలనీలో...

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక మోడల్‌కాలనీ, మున్నలూరు, పరిటాల, కీసర, పెండ్యాల, వేములపల్లి అంగనవాడి కేంద్రాల్లో శుక్రవారం చిన్నారులతో యోగాసనాలు వేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తారాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

అల్లూరు(వీరులపాడు): యోగా సాధనతో ఎన్నో ప్రయోజనాలున్నాయని అల్లూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట నారాయణ పేర్కొన్నారు. పాఠశాలలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించడంతోపాటు వారిచే యోగాసనాలు వేయించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజులో కొంత సమయం యోగా సాధన చేయాలని సూచించారు. యోగాతో మానసిక, శారీరక అలసట దూరమవుతుందని పేర్కొన్నారు. పీఈటీ రాజు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రవీంద్ర మాట్లాడుతూ యోగాతో ఒత్తిడిని జయించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంగతాయమ్మ, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, సుజాత, మేరీ, దయామణి, వసంత, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు విద్యా సంస్థలలో సామూహిక యోగాసనాల కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో యోగ సాధకుల సంఘం, పతంజలి యోగా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులచే యోగాసనాలు, సూర్యనమస్కారాలు వేయించారు. యోగ గురువు వంగవీటి సాయికుమార్, ఎంఈవో రవీంద్రనాయక్ ప్రసంగించారు. హెచ్ఎం ఎ. లక్ష్మి, యోగా నిర్వాహకులు రాధాకృష్ణ, పూర్ణయ్య, కరుణాకర్‌రెడ్డి, గంగాధర్, ఆర్.శివయ్య పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో...

స్థానిక జేఆర్సీ-విశ్వభారతి డిగ్రీ కళాశాలలో యోగా నిపుణులు సంగెపు సుబ్బారావు గురూజీ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ యోగసనాలు, ధాన్యపద్ధతులు, ఆహారపు నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, పెనుగొండ వెంకట రాజీవ్, కేఎస్.రమేష్, జిల్లా తిరుపతిరావు, జూటూరి అబ్బులు, నారాయణరావు, వెంకటేశ్వరరాజు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో యోగా డే ను నిర్వహించారు. యోగా డేను పురస్కరించుకొని పట్టణానికి చెందిన యోగ గురువు కిలారు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం యోగా గురువు దంపతులను శిష్య బృందం సత్కరించింది. నందిగామ మండలంలోని పల్లగిరి, చందాపురం గ్రామాల్లోని ఎంపీయూపీ పాఠశాలల్లో యోగా డేను పురస్కరించుకొని యోగా సాధనతో కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివరించారు. చందర్లపాడు మండలం రామన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సూర్యనమస్కారాలు, యోగాసనాలపై అవగాహన కల్పించారు.



అనిగండ్లపాడులో విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న వైద్యాధికారి రత్నప్రియదర్శిని



రామన్నపేటలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



యోగాగురువు కిలారు ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న శిష్యులు



గండేపల్లిలో యోగా ఆంగ్ల అక్షరమాల ఆకారంలో విద్యార్థులు



అల్లూరులో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న ఎంఈవో రవీంద్ర, ఉపాధ్యాయులు



యోగాగురువు సాయికుమార్‌ను సత్కరిస్తున్న ఎంఈవో రవీంద్రనాయక్ తదితరులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



కంచికచర్లలో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

కంచికచర్ల : మూడేళ్లు నిండిన చిన్నారులను తల్లిదండ్రులు వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తారాబీ కోరారు. స్థానిక మోడల్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రీస్కూల్ నుంచి ఒకటోతరగతిలో చేరనున్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈసందర్భంగా తారాబీ మాట్లాడుతూ అంగనవాడీ కేంద్రాల్లో పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. చిన్నారు లకు ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తున్నామన్నారు. ప్రీస్కూలు మెటీరియల్ ఎగ్జిబిషన్‌లు నిర్వహించి చిన్నారుల తల్లులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు బుద్దా నీరజ, మహాలక్ష్మి, రాణి, లీల, అపర్ణ, వి.మహాలక్ష్మి, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

జేసీబీతో చెత్త తొలగింపు

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి స్మశాన వాటికకు వెళ్లే రోడ్డుపై చెత్తాచెదారం ఉండటంతో శుక్రవారం జేసీబీ సాయంతో తొలగించి ట్రాక్టర్లతో డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచి బొక్కా రవికుమార్ మాట్లాడుతూ రోడ్డు పక్కన నివసించే ప్రజలు చెత్తను రోడ్డుపై వేయరాదని అన్నారు. పారిశుద్ధ్యం మెరుగునకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా చెత్తను తొలగించి బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నందిగామ: జ్యేష్ఠ మాసం పౌర్ణమి శుక్రవారం నేపథ్యంలో మండలంలోని పలు ఆలయాలలో విశేష పూజలు జరిగాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన దాములూరు కూడలిలోని శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకుడు దాములూరి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. మాగల్లు గ్రామంలోని వైకుంఠ నారాయణ క్షేత్రంలో చెంచులక్ష్మి, రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.